క్లుప్తంగా

వాల్మీకుల హక్కుల సాధనకు పోరాటం ఆగదు

చిన్నంబావి: వాల్మికీ బోయల హక్కులకోసం పోరాటం ఆగదని సంఘం తాలుకా అధ్యక్షుడు రాజ్‌కుమార్‌నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని బెక్కెం గ్రామంలో సంఘం మండల అధ్యక్షుడు ఉమేశ్‌నాయుడు అధ్వర్యంలో గ్రామకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తమను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గోపాల్‌నాయుడు, ఉపాధ్యక్షుడిగా వెంకటస్వామి, కురుమూర్తి, 20 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సత్యానారాయణ, బీసీ సంఘం మండల అధ్యక్షుడు రామకృష్ణ, యాదగిరి పాల్గొన్నారు.

బడుల బలోపేతానికి కృషి

పాన్‌గల్: అమ్మఆదర్శ కమిటీల సభ్యులు ప్రభుత్వ బడుల బలోపేతంలో భాగస్వాములు కావాలని ఎంఈఓ శ్రీనివాసులు, ఏపీఎం వెంకటేశ్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో అమ్మఆదర్శ కమిటీల చైర్మన్లకు విధులు, బాధ్యతలపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. పాఠశాలల నిర్వహణ, పారిశుద్ధ్యం, విద్యార్థుల హాజరుశాతాన్ని పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు సురేఖయాదవ్, హెచ్‌ఎం.పద్మ పాల్గొన్నారు.

పకడ్బందీగా నులి నివారణ మాత్రల పంపిణీ

పాన్‌గల్: ఈనెల 11వ తేదీన నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మాత్రల పంపిణీ పకడ్బందీగా చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. మాత్రలు తీసుకోవడంతో కడుపులో నులిపురుగులు నశిస్తాయన్నారు. రక్తహీనత, శారీరక అలసట లేకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీల్లో పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విత్తనాల పంపిణీ

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని గుమ్మడం గ్రామంలోని రైతువేదికలో బుధవారం రైతులకు విత్తనాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్‌చైర్మన్ గౌని ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయవర్ధన్‌రెడ్డి, ఏఓ షేక్ మున్నా పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎన్‌ఎఫ్ ఎస్ ఎమ్ స్కీం కింద 350 మంది రైతులకు వీబీఎన్ 4 కేజీల మినుముల ప్యాకెట్ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, హార్టికల్చర్ అధికారి కృష్ణయ్య, ఏఈఓ ప్రశాంత్, ఆంజనేయులు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

భార్యను వేధించిన భర్తపై కేసు నమోదు

పాన్‌గల్: అనుమానంతో భార్యను వేధిస్తూ ఆమెపై దాడి చేసి గాయపర్చిన భర్తపై కేసు నమోదైన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామానికి చెందిన కొమారి మాధవికి బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. గత సంవత్సరం నుంచి అనుమానంతో భర్త మానసికంగా, శారీరకంగా వేధిస్తూ సంసారం చేయకుండా, కుటుంబంతో కలిసి ఉండకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇదే క్రమంలో బుధవారం భార్యతో గొడవపడి దూషించి కట్టె, రాయితో దాడిచేసి గాయపర్చారు. ఘర్షణలో అడ్డుగా వచ్చిన అత్త కృష్ణమ్మపై కట్టెతో దాడి చేసి గాయపర్చారు. ఈ ఘటన బయటికి చెబితే చంపుతానని బెదిరించాడు. ఆంజనేయులుపై తగు చర్యలు తీసుకోవాలని భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భర్త, మామపై కేసు నమోదు

ఖిల్లాఘనపురం: కుటుంబ కలహాలతో గొడవ పెట్టుకుని ఓ మహిళను దూషించి, రక్తగాయాలు వచ్చేలా కొట్టిన భర్త, మామపై కేసునమోదు చేసినట్లు ఎస్సై జె.నరేష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని షాపురం గ్రామానికి చెందిన గంగనమోని లావణ్యకు తన భర్త నరేష్‌తో మంగళవారం గొడవ జరిగింది. ఈ సమయంలో మధ్యలో వచ్చిన మామ మల్లయ్య భర్తతో కలిసి ఆమెను దుర్భాషలాడటంతో పాటు కొట్టారు. ఈ సంఘటనలో ఆమె తలకు రక్తగాయమైంది. బుధవారం ఆమె పోలీసులకు భర్త, మామపై ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. ఆమెను వైద్యం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించామని ఆయన తెలిపారు.

పలకల పంపిణీ

కొత్తకోట రూరల్: మండలంలోని భూత్కూర్ గ్రామంలో బుధవారం తెలంగాణ ఉద్యమకారుడు టీజీ మహేష్ అంగన్‌వాడీ చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జయశంకర్ జయంతి సందర్భంగా పలకలు అందజేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాములు, టీచర్ సువర్ణ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల్లో గుబులు

- జిల్లాలో ఆరుగురు సస్పెండ్
- అటెండెన్స్‌లో తప్పుడు సమాచారం
- గ్రామ సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్న ప్రజలు



అమరచింత మండలం నందిమళ్ల గ్రామ పంచాయతీ భవనం

అమరచింత: జిల్లాలోని ఆయా గ్రామాల్లో ఫేక్ అటెండెన్స్‌తో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ గత శనివారం సస్పెండ్ చేయడంతో పంచాయతీ కార్యదర్శుల్లో గుబులు నెలకొంది. ప్రతి నిత్యం తమకు కేటాయించిన గ్రామానికి వెళ్లి పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలిస్తూ గ్రామాభివృద్ధిలో ప్రధానపాత్ర పోషిస్తున్న కార్యదర్శులకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హడలెత్తిస్తోంది. ఎవరు వస్తారు.. ఎవరు చూస్తారు అనే భ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులకు తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హాజరుయాప్ తమ తప్పిదం ఎత్తిచూపుతుందని పసిగట్ట లేకపోయారు. తీరా గత నెల రోజుల నుంచి గ్రామాల వారిగా కార్యదర్శులు అటెండెన్స్ వివరాలను సేకరించి యాప్‌లో తమ ఫొటోకు బదులుగా ఇతరుల ఫొటో పెట్టి హాజరు నమోదు చేసుకున్నారనే గమనించి అలాంటి వారిని సస్పెండ్ చేయడంతో ఇక మిగిలిన వారికి భయం కలిగించే విధంగా ప్రభుత్వ చర్యలు తీసుకోవడంతో కార్యదర్శులు హడలెత్తుతున్నారు.

నిశితంగా పరిశీలిస్తున్నాం..



మండలంలోని ఆయా గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులు సమయానికి కార్యాలయానికి వెళ్లి అక్కడి నుంచే అటెండెన్స్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారా లేదా అనే విషయాలను గమనిస్తున్నాం. ఇకపై రోజు వారి ఆయా గ్రామాలకు వెళ్లి అక్కడ కార్యదర్శి ఉన్నాడా లేదా అనే విషయాలను సైతం గమనించేందుకు ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం.

– శ్రీరాంరెడ్డి ఎంపీడీఓ, అమరచింత

ఆరు మండలాల్లో ఆరుగురు..

జిల్లాలోని అమరచింత, ఆత్మకూర్, పాన్‌గల్, పెబ్బేరు, గోపాల్‌పేట, మదనాపురం మండలాల్లో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు కార్యదర్శులు ఫేక్ అటెండెన్స్ ఇస్తున్నారనే రుజువులతో సస్పెండ్ చేశారు. జిల్లాలో మొత్తం 268 పంచాయతీలుండగా 251 మంది కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో రెగ్యులర్‌గా 217 మంది ఉండగా ఓపీఎస్‌లు 30, జేపీఎస్‌లు నలుగురు ఉన్నారు. కాగా ప్రత్యేకంగా కార్యదర్శుల సెల్‌ఫోన్‌లో హాజరు కోసం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తమ సౌకర్యం కోసం పంచాయతీ వర్కర్ల మొబైల్‌లో సైతం వీటిని డౌన్‌లోడ్ చేసుకుని హాజరు వేసుకుంటున్నారనే విషయం వెలుగులోకి రావడంతో కార్యదర్శులు అవాక్కవుతున్నారు.

జిల్లాస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు కృషి


సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరిసరాల పరిశుభ్రతతో పాటు అవసరమైన మరమ్మతులు చేయించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి వైద్య శాఖ అధికారులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఉదయం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ ఆసుపత్రి చుట్టూ పక్కల పరిసరాలను పరిశీలించారు. వెంటనే పరిసరాలు శుభ్రం చేయించాలని అదేవిధంగా ఆసుపత్రి చుట్టూ అవసరమైన చోట సీసీ రోడ్డు, మురుగు కాలువ మరమ్మతు పనులు చేయించి, అందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఆసుపత్రి వెనక భాగంలో ఉన్న ఖాళీ స్థలాన్ని వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలంగా ఉపయోగించుకోవాలన్నారు. డాక్టర్లు, ప్రొఫెసర్లు హెడ్ క్వార్టర్లో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో ఈఎన్‌టీ వార్డు, ఏఆర్‌టీ వార్డులను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత విభాగంలో సర్జన్‌లు, డాక్టర్లు లేకపోవడాన్ని గమనించారు. వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్ ను ఆదేశించారు. అనంతరం సూపరింటెండెంట్ ఛాంబర్‌లో వైద్యసిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో రోజుకు ఎన్ని సర్జరీలు చేస్తున్నారు? ప్రసవాలు ఎన్ని? ఎంత మంది అవుట్ పేషంట్ వస్తున్నారు ఎక్కువ మంది ఎలాంటి జబ్బులతో వస్తున్నారు? ఎన్ని రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు అనే వివరాలు అడగటమే కాకుండా అందుకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. జ్వరం, వళ్ళు నొప్పులు వంటి వ్యాధి లక్షణాలతో వచ్చే రోగులకు తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయాలని, ముఖ్యంగా డెంగీ పరీక్షలు తప్పకుండా చేయాలని సూచించారు. జిల్లాలో డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధి రాకుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. 30 ఏళ్ల వయస్సు పైబడిన వారు ఆసుపత్రికి వస్తే ఖచ్చితంగా బీపీ మధుమేహం పరీక్షలు నిర్వహించాలన్నారు. కంటికి సంబంధించిన కేటరాక్ట్ సర్జరీలు అవసరమైన వారందరికీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని, కంటి వెలుగు ద్వారా కేటరాక్ట్ సమస్యలు గుర్తించిన వారిని గుర్తించి అవగాహన కల్పించి ఉచితంగా సర్జరీ చేయాలన్నారు. కలెక్టర్ వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్, జిల్లా వైద్య అధికారి శ్రీనివాసులు, సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సాయినాథ్ రెడ్డి, వైద్యులు రామచంద్రరావు, పరిమళ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న 100 రోజుల కార్యాచరణ


వనపర్తిలో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

వనపర్తిటౌన్: 100 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా కేంద్రం మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో శానిటేషన్, కుక్కలను పట్టుకోవడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయా వార్డుల్లో 100 రోజుల కార్యాచరణ నిర్వహించారు. ఈ సందర్భంగా తడి, పొడి వ్యర్థాల విభజన, సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా అవగాహన కల్పించారు. అదేవిధంగా హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ పట్టణంలోని పలు షాపులపై ప్లాస్టిక్ దొరికిన షాపులకు రూ. 4,500 జరిమాన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌ఫెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, డీఎంసీ బాలరాజు, జేపీ సాయికృష్ణ పాల్గొన్నారు.

ఆత్మకూర్: పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో అధికారులు, కార్మికులతో కలసి 100 రోజుల ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. వర్షపు నీరు చేరి దోమలువ్యాప్తి చెందే అవకాశాలున్నాయన్నారు. డ్రమ్ముల్లో, హౌసుల్లో తదితర వాటిల్లో నీరు నిల్వ ఉంచకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ సురేందర్‌గౌడ్, వార్డుల అధికారులు ఝాన్సీరెడ్డి, అనూష, మోహన్, కాషన్న, ముబ్బషీర్, అశోక్, మోహన్‌సాగర్, దయానంద్ తదితరులు ఉన్నారు.

'రాజీవ్ యువవికాసం' అమలు చేయాలి

పాన్‌గల్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలు అందించడానికి అమలుచేసే రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు తీసుకొని రుణాల మంజూరులో కాలయాపన చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దరఖాస్తులను పరిశీలన చేసి అర్హులైన వారికి నిధులు మంజూరు చేయాలని లేనిచో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

నేడు ఆంజనేయస్వామి పూజలు

అమరచింత: మండల కేంద్రంలోని పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయ పునః నిర్మాణ పనులను గురువారం వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు పూజా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. గణపతి పూజ, పుణ్యావాచనము, వాస్తు నవగ్రహ సర్వతో భద్రమండలి దేవత పూజల హోమం, శ్రీ హనుమంత కేల పకర్పణ బలి, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టీకాలపై శ్రద్ధ తీసుకోవాలి

వీపనగండ్ల: పసిపిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడంలో శ్రద్ధ వహించాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. బుధవారం కల్వరాల్ల గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ప్రతి ఫ్రైడేను డ్రైడే దినంగా పాటిస్తూ గ్రామాల్లోని వీధులను సందర్శించి మురుగు నీరు నిల్వ ఉంచకుండా చూడాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన వైద్య సిబ్బంది ఆదేశించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో టీకాలు, మాత్రలను పరిశీలించారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: గ్రామాలభివృద్ధి కోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, మండల ఎన్నికల కన్వీనర్ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పీఎం నరేంద్రనమోదీ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెడుతున్నదన్నారు. త్వరలో జరిగే పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలకు కావల్సిన నిధులను కేంద్రం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, జానకిరాములు, మల్లన్న, బాలయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన జాగృతి నాయకులు

కొత్తకోట రూరల్: తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కవితను బుధవారం హైదరాబాద్ లోని బంజరాహిల్స్‌లో జాగృతి కేంద్ర కార్యాలయంలో కొత్తకోట జాగృతి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగా రానున్న రోజుల్లో మనకుమంచి రోజు వస్తాయని, క్షేత్రస్థాయిలో జాగృతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ కవిత సూచించినట్లు వారు తెలిపారు. అదే విధంగా 42 శాతం రిజర్వేషన్ కోసం నిరసనలు, రాస్తారోకోల్లో అందరు పాల్గొనాలని సూచించారు. దాసరి విజయ్, విజయ్, ఎల్లస్వామి, పాష, రవి ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

వనపర్తి: సైబర్‌నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఐ కృష్ణయ్య అన్నారు. బుధవారం సైబర్ జాగ్రత్త సదస్సులో భాగంగా ఎస్పీ రావులగిరిధర్ ఆదేశానుసారం పట్టణంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎస్ఐలు రవి ప్రకాష్, హరిప్రసాద్ అధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ మోసాలు జరిగే విధానాన్ని సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్, ప్రిన్సిపాల్ ఆనంద్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని వినతి..


ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

కొత్తకోట రూరల్: మండలంలోని పాలెం గ్రామంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు చీర్ల నర్సింహ ఎంపీ డీకె అరుణ దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే ఆమె స్పందించి స్థానిక విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలంటూ ఎస్ఈ రాజశేఖర్‌కు లేఖపూర్వకంగా రాశారు. దీంతో త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎస్ఈని కలిసిన వారిలో నరేందర్‌రెడ్డి, సత్యారెడ్డి, బుద్దేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణ, శ్రీహరి ఉన్నారు.

సైబర్‌నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

ఆత్మకూర్: వినియోగదారులు, రైతులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, తీసుకున్న రుణాలు చెల్లించి కొత్తరుణాలు పొందాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధికారి నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పిన్నంచర్ల గ్రామంలో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కురుమూర్తి, లక్ష్మి, ఖాజన్న, రాములు, మల్లేష్‌గౌడ్, రవీందర్, సత్యన్న, శివ, స్థానికులు ఉన్నారు.

మార్కెట్‌యార్డు చైర్మన్‌కు సన్మానం

ఆత్మకూర్: ఆత్మకూర్ మార్కెట్‌యార్డు చైర్మన్ రహ్మతుల్లాను తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ శ్రీపాద్, ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, ఎంపీఓ నర్సింహయ్య తదితరులు పూలమాల, శాలువతో సన్మానించారు. బుధవారం స్థానిక మార్కెట్ కార్యాలయంలో అధికారులు చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి రైతులకు అన్నివిధాలుగా మేలు చేకూర్చాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయ్‌కుమార్‌రెడ్డి, పంచాయితీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లాకార్యదర్శి ఎండీ గౌస్, కార్యదర్శులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగుల వితరణ

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ ఉన్నత పాఠశాలలోని 100 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశామని హెచ్‌ఎం చెన్నప్ప తెలిపారు. ఆకాజ్యోతి ఫౌండేషన్ మహబూబ్‌నగర్‌కు చెందిన జ్యోతి వీటిని అందించారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చెన్నప్ప, ఉపాధ్యాయ బృందం దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు

అమరచింత: పట్టణంలోని హిందు స్మశాన వాటికలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. పార్టీ మండల అధ్యక్షురాలు లావణ్య స్మశాన వాటికలో చీకటిలో భయపడుతన్నారని లక్ష్మీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు స్పందించి రూ.2 లక్షలతో లైట్లను ఏర్పాటు చేశారు. బుధవారం వాటి పనుల్లో భాగంగా గుంతలను తవ్వారన్నారు. కార్యక్రమంలో భాస్కర్, సురేష్, పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం


తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న అధికారి

పాన్‌గల్: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆసియా బేగం అన్నారు. బుధవారం మండలంలోని చింతకుంట గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పిల్లలకు రెండేళ్ల వరకు కచ్చితంగా తల్లిపాలే పట్టించాలన్నారు. దీంతోపాటు మహిళశిశు సంక్షేమ శాఖ మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్టు సలోమి మహిళ సాధికారత, సుకన్య సమృద్ధియోజన, పీఎం జీవన్ జ్యోతి ప్రయోజనాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నారాయణమ్మ, అమృతమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఇంటింటికీ కేంద్ర పథకాలు

ఆత్మకూర్: గడప గడపకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌భూపాల్, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కత్తేపల్లి గ్రామంలో సంపర్క్ అభియాన్‌లో భాగంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్, మనోహర్‌గౌడ్, నరేందర్‌గౌడ్, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా చేయాలి

అమరచింత: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక సరఫరా చేయాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంగం జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణానికి ఇసుక లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుకను అందుబాటులో ఉంచకపోవడం దారుణమన్నారు. ఒకొక్కరి దగ్గర 1700 వందల చాలన్ కట్టించి అలాట్మెంట్ చేయించి ఇప్పటివరకు ఇసుకను పంపిణీ చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతిలేని ఇసుక దందా రాత్రి వేలలో జోరుగా సాగుతుందన్నారు.సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ రవికుమార్‌కు అందించారు. కార్యక్రమంలో చంటి, కర్ణాకర్ ఉన్నారు.

ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి


జిల్లా గ్రంథాలయంలో జయశంకర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

వనపర్తిటౌన్: తెలంగాణ చరిత్రలో చెరగని పేరు ఆచార్య జయశంకర్‌దని ప్రజాప్రతినిధులు, కళాశాలల, స్కూల్స్ ప్రిన్సిపాల్స్ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో, గ్రంథాలయంలో, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో, పలు స్కూల్స్‌ల్లో, ప్రభుత్వ డిగ్రీ కో-ఎడ్, మహిళా డిగ్రీ కళాశాలలో జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతిని స్ఫూర్తివేదిక, టీజేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. వేరువేరుగా జరిగిన కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘునందన్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, న్యాయవాది ఉత్తరయ్య, లైబ్రేరియన్ శ్రీనివాసులు, స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌పాషా పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల జెడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాల, అంజనగిరి ప్రాథమిక పాఠశాల్లో జయశంకర్ చిత్రపటానికి అంజనమ్మ, ఉపాధ్యాయులతో కలసి నివాళులర్పించారు.

వీపనగండ్ల: మండలంలోని తూముకుంట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, పాల్గొన్నారు.

అమరచింత: బీఆర్‌ఎస్ నాయకులు బస్టాండ్ సమీపంలో జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నాగరాజ్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవికుమార్ నివాళులర్పించారు

ఆత్మకూర్: జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో, జూనియర్ కళాశాలలో, మార్కెట్‌యార్డులో, తహసీల్దార్ కార్యాలయంలో, ఎంపీడీఓ కార్యాలయంలో, బాలకిష్టాపూర్ కేజీబీవీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ శ్రీపాద్, మార్కెట్ ట్చైర్మన్ రహ్మతుల్లా, ఎంఈఓ బాలరాజు, ప్రిన్సిపాళ్లు గోపాల్ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గర బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ళకృష్ణయ్య ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పీఆర్టీ అధ్యక్షుడితో పాటు మాజీ మండల జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడారు.


ఖిల్లాఘనపురంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు


వనపర్తిలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, విద్యార్థులు


ఆత్మకూర్‌లోని డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న సిబ్బంది